
TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 58 | 16 శుక్రవారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం.. రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!

- బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ
- ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ



సీఎం రేవంత్ ఆదేశాల అమలు..

విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

- యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్
- విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు
- విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ
- విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
- ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక



తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ...మిగతా 2 లో...

సీఈసీని రక్షించేందుకే ఇదంతా

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని సీజేపీ ఆరోపణ
- ఎన్నికల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని అభిజిత్ దీప్కే విమర్శ
- ప్రభుత్వానిది 'ఒకే దేశం, ఒకే పార్టీ' నినాదమని విమర్శలు
- నటుడు ప్రకాశ్ రాజ్, ఇతర నేతలతో కలిసి దీప్కే మీడియా సమావేశం

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనా మాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం ఆరోపిం చారు.ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా బోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. "ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?"



...మిగతా 2 లో...

ఎస్ఐఆర్‌పై రాహుల్ గాంధీ పిటిషన్..

ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు

- ఎస్ఐఆర్ పిటిషన్‌పై ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు
- ఎస్ఐఆర్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి
- అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థన
- నిరసన వేదికగా జంతర్ మంతర్ తొలగింపు పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు నోటీసులు
- సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ధర్మాసనం ఆదేశం



ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భారీగా ఓట్ల తొలగింపు, అక్రమాలు జరిగాయంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నేడు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎస్ఐఆర్ వ్యవహారంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు ఇటీవల సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లి ఉమ్మడి పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మా సనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమి షనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ...మిగతా 2 లో...

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ
- ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్
- ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్





ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు

2 లో

- ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి
- కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలువరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం

ఇంటర్నెట్ నిలిపివేత..!

సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ

- కోర్టు ధిక్కరణ కేసులో అఫిడవిట్ దాఖలు
- రైసీనా హిల్స్ పరిధిలో 24 గంటల పాటు సెల్యులర్ సేవలు నిలిపివేసినట్లు వెల్లడి
- సీఈసీ రాజీనామా కోరుతూ తలపెట్టిన ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం
- ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు తెలిపిన ఢిల్లీ పోలీస్ కమిషనర్



దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల సందర్భంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు సంబంధించి దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ వ్యవహారంపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 10న ఢిల్లీలో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ...మిగతా 2 లో...

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్

- భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో తొలి దశ పూర్తి
- ప్రస్తుతం ఒప్పందం లీగల్ డ్రాఫ్టింగ్ దశలో ఉందన్న కేంద్ర మంత్రి
- చర్చలు కొలిక్కి వస్తున్నాయన్న విదేశాంగ మంత్రి జైశంకర్
- పోటీ దేశాలపై పైచేయి సాధించడమే లక్ష్యమంటున్న భారత్

భారత్-అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పురోగతి లభించింది. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌లో మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం ఇది న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్టింగ్) దశలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో నిర్వ హించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు."అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబం ధించి తొలి విడత చర్చలు ఫలప్రద మయ్యాయి. ...మిగతా 2 లో...

సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన..

శ్రీధర్‌బాబు ఏమన్నారంటే?

- సింగరేణిని ప్రైవేటీకరించబోమని శ్రీధర్‌బాబు స్పష్టీకరణ
- ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి
- గత బీఆర్ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు

- సింగరేణికి భారీగా బకాయిలు పెట్టారని ఆరోపణ
- ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపిం చారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బ తీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.

...మిగతా 2 లో...



TGTEL/26/A5513
వార్తదీపిక

ఎస్ఐఆర్‌పై రాహుల్ గాంధీ పిటిషన్..
ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన ఓట్ల తొలగింపులు, మార్పులపై స్వతంత్రంగా ఆడిట్ నిర్వహించాలని ప్రతిపక్ష నేతలు కోరారు. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సాంకేతిక నిపుణులు, ప్రముఖ పౌరులతో కూడిన స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఓటరునైనా ముందస్తు నోటీసు ఇవ్వకుండా, తన వాదన వినిపించే అవకాశం కల్పించకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పంజాబ్‌తో పాటు ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాల్లో అర్హులైన ఓటర్లు చట్టం అనుమతించిన చివరి తేదీ వరకు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. పిటిషన్‌పై తుది నిర్ణయం వెలువడే వరకు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కూడా అభ్యర్థించారు.రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ ప్రసాద్ యాదవ్, సాగతా రాయ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, డి.రాజా తదితరులు ఈ పిటిషన్‌లో సహ పిటిషనర్లుగా ఉన్నారు.మరోవైపు, జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశంగా గుర్తించిన హోదాను తొలగించడాన్ని సవాలు చేస్తూ స్వాతి సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రాంగణంతో పాటు సంబంధిత ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ఆదేశించింది. అక్టోబర్ 10న ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల నేపథ్యంలో నిరసనలు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రాకపోకలకు అంతరాయాలపై దాఖలైన ఇతర పిటిషన్లను కూడా ధర్మాసనం విచారించింది.

ఇంటర్నెట్ నిలిపివేత..!
సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ

మొదటిపేజీ తరువాయి

ఇందులో భాగంగా అక్టోబర్ 9వ తేదీ రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు, అంటే 24 గంటల పాటు రైసీనా హిల్స్ పరిసరాల్లోని 4 కిలోమీటర్ల వ్యాసార్ధంలో సెల్యులర్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అయితే, వై-ఫై, బ్రాడ్‌బ్యాండ్ వంటి సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించలేదని హోం సెక్రటరీ తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు చేసిన అభ్యర్థన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.కాగా, నిరసనల సందర్భంగా మెట్రో, రైళ్లు సహా ఇతర అత్యవసర సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ఈ ఆదేశాలను ఉల్లంఘించడమేనంటూ కోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కేంద్ర హోం కార్యదర్శి, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సహా ఇతర ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులోనే హోం సెక్రటరీ తాజాగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్ సమర్పించారు.మరోవైపు, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సైతం తన అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. జులై 20న జరిగిన నిరసనల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, నిరసనకారులను నియంత్రించడం కష్టతరంగా మారడం, సామాన్య ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడం వంటి కారణాలతో అక్టోబర్ 10న తలపెట్టిన ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు ఆయన తెలిపారు. ఈ అఫిడవిట్‌లను పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్య మంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం..
రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చు కునేందుకు అధికారులపై నెపం నెడు తున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడ గొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు.రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు.నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

సీఈసీని రక్షించేందుకే ఇదంతా

మొదటిపేజీ తరువాయి

అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు.ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు. 'ఒకే దేశం, ఒకే పార్టీ' అజెండా ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. అంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధాని భయపడు తున్నారా? అని ప్రశ్నించారు. సీజేపీ నేతల అరెస్ట్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్యా షిండే నిరసన చేపట్టారు. పోలీస్ బారికేడ్లను దాటి నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై కేసు నమోదు చేసి, దాస్, రంకాలను జ్యుడీషియల్ కస్టడీకి పంపి తీహార్ జైలుకు తరలించారు. అజింక్యా షిండేను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీజేపీ లీగల్ టీం హెడ్ రత్నా సింగ్ తెలిపారు. తమ నేతల అరెస్టులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీజేపీ స్పష్టం చేసింది.

సీఎం రేవంత్ ఆదేశాల అమలు..
విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు.రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేశారు.

సీఎంఆర్ చెక్కు అందజేత

జహీరాబాద్ అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోనింటి మాణిక్‌రావు ఆదేశాల మేరకు ఝరాసంగం మండలం మేదపల్లి పట్లోళ్ల సంగమేశ్వర్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం అందజేశారు. మేదపల్లి గ్రామానికి చెందిన సంగమేశ్వర్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని మెరుగైన వైద్యం పొందారు. ఈ నేపథ్యంలో ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరయ్యాయి. ఈ చెక్కును ఝరాసంగం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, బీఆర్ఎస్ సీనియర్, మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్, మేదపల్లి అందజేశారు. లబ్ధిదారుడు సంగమేశ్వర్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.



ఢిల్లీలో సీజేపీ నిరసన..
అడ్డుకోలేమన్న హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (గురువారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది.దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరపు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి నిరాకరించింది.మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ పిలుపునిచ్చిన ఈ నిరసనలో తాము కూడా పాల్గొంటామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. నిరసనకారులు జాతీయ జెండాలతో తరలిరావాలని దీప్కే పిలుపునిచ్చారు.ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ ఎన్నికల సంఘానికి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రాంగణంలో మార్చ్ నిర్వహించడంపై దాఖలైన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసన నాటి సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని అధికారులను ఆదేశించారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం..
కీలక ప్రకటన చేసిన పీయూష్ గోయల్

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం దీనికి తుది మెరుగులు దిద్దుతున్నాం. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత, మన పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా ఈ ఒప్పందాన్ని అమలు చేస్తాం" అని పీయూష్ గోయల్ వివరించారు. ఇదే విషయంపై వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, చర్చలు సానుకూల దిశలో సాగుతున్నాయని, వీలైనంత త్వరగా ఒప్పందం కొలిక్కి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో టారిఫ్ విధానంపై మరింత స్పష్టత వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు.విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఒప్పందంపై ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు తుది దశకు (ల్యాండింగ్ పాయింట్) చేరుకుంటున్నాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు దక్కే అదనపు ప్రయోజనాలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.అయితే, అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ ఇటీవల మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరు దేశాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, ఇది వెంటనే కార్యరూపం దాల్చే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ఇంకా పరిష్కారం కాని కొన్ని అంశాలపై ఇరు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.టారిఫ్ సమస్యలు, ఇతర అడ్డంకులను తొలగించి, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో 2025 ప్రారంభం నుంచి భారత్, అమెరికా మధ్య ఈ చర్చలు సాగుతున్నాయి. గతంలో అమెరికా విధించిన సుంకాలు, హెచ్1బీ వీసా ఫీజుల పెంపు, గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్‌పై ఆంక్షల వంటి పరిణామాలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపిన నేపథ్యంలో, తాజా పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి
కీలక ప్రకటన..
శ్రీధర్‌బాబు ఏమన్నారంటే?

మొదటిపేజీ తరువాయి

సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

అనంతుల రాజుకు ఏసిపి సన్మానం .

కమాన్ పూర్ ప్రజా క్రాంతి అక్టోబర్ 15.



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవా దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన అనంతుల రాజును రామగుండం పోలీస్ కమిషనరేట్ ఏసిపి మడత రమేష్ గురువారం తన చాంబర్లో శాలువాతో సన్మానించి సత్కరించారు రాష్ట్రస్థాయిలో ఉపాధ్యక్షులుగా నియామకం పట్ల ఆయన హర్షం వ్యక్తం వెలిబుచ్చారు

TGTEL/26/A5513 వార్త దీపిక

దసరా పండుగ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న 55 అడుగుల రావణాసురుడి బొమ్మ

స్టేడియం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలి

టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం పరిశీలించారు. రావణ దహనం కోసం సిద్ధం చేస్తున్న 55 అడుగుల రావణాసురుడి బొమ్మతో పాటు బాణసంచా కాల్చేందుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గత 30 సంవత్సరాలుగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో ఏటా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భారీ రావణాసురుడి బొమ్మ దహనం, పెద్ద ఎత్తున బాణసంచా ప్రదర్శనతో పాటు ప్రముఖ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జగ్గారెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్ల పరిశీలన సందర్భంగా స్టేడియంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జగ్గారెడ్డి సూచించారు. ముళ్లకంపలను తొలగించి, చెత్తాచెదారం లేకుండా మైదానాన్ని శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి, ఉత్సవ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, భవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బెస్త నగేష్, సభ్యులు, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్ , శ్రీహరి తదితరులు పాల్గొన్నారు



సింగూర్ ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే

జహీరాబాద్,అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :


ఎల్ లినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షాలు కురవ లేదని, అందుకు సింగూర్ ప్రాజెక్టును ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు సంబంధిత అధికారులతో సందర్శించి పరిశీలించారు. కలిసి సింగూర్ ప్రాజెక్టును సందర్శించి, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నీటి నిల్వలు, నీటి వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు.ఎల్ లినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు చోటుచేసుకునే అవకాశాల నేపథ్యంలో నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాజెక్టులోని నీటి నిల్వలు, భవిష్యత్తులో నీటి అవసరాలు, రైతులకు సాగునీటి లభ్యత వంటి అంశాలపై అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. నీటి వనరులను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ, తాగునీటి అవసరాలకు రైతుల సాగునీటి అవసరాలకు తగిన ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.



రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

సంగారెడ్డి అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :

బీజేపీ కిసాన్ మోర్చా ధర్నా భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లెపల్లి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు విద్యుత్ సరఫరా సక్రమంగా అందకపోవడంతో వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా కేంద్రంలోని ఐబీ భవనం నుంచి సదరన్ ఎలక్ట్రిసిటీ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి, అనంతరం సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు, ఏ.డీ. వినతిపత్రం సమర్పించడం జరిగింది. ప్రభుత్వం రైతులకు విద్యుత్ సరఫరా విషయంలో తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను, నిర్ణీత సమయానికి నిరంతరాయంగా సరఫరా చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వపురం లక్ష్మన్న, బీజేపీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ రెడ్డి, పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్ర నాయకులు దీశ్పాండే, కులకర్ణి, రవీందర్, జిల్లా నాయకులు మాణిక్యరావు, రాశేకర్ రెడ్డి, జగన్, భాస్కర్, భూమన్న, కొండ లక్ష్మణ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, శివ, ఉపాధ్యక్షులు రంజిత్ రెడ్డి, మోహన్ రెడ్డి, వై. రాజు, బీజేపీ బీరంగూడ నాయకులు ఈర్ల రాజు పట్టణ అధ్యక్షులు అలాగే నాయకులు, తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు, కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కిసాన్ మోర్చా నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలి

పంటల రక్షణకు రానున్న 15--20 రోజులు కీలకం

నీటి సంరక్షణ, ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

సీఎస్ సంజయ్ జాజు









సంగారెడ్డి, అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో చోటు చేసుకుంటున్న మార్పులు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రస్తుత పంటలను కాపాడేందుకు వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత, వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం సీఎస్ జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా సింగూరు జలాశయంలో నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ట్రాన్స్‌కో సీఎండీ జితేష్ వి. పాటిల్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సింగూరు జలాశయంలో నీటిమట్టం, జిల్లాలో తాగునీటి లభ్యత, వర్షపాతం, పంటల సాగు పరిస్థితులు, తాగునీటి సరఫరాకు రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికల గురించి సీఎస్‌కు వివరించారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. గ్రామాల వారీగా తాగునీటి అవసరాలను గుర్తించి, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కార్యాచరణ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అగ్రిమెంటేషన్ అవసరమైన పనులన్నింటినీ నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో అవసరమైనప్పుడు నీటి రవాణా ఏర్పాట్లు చేయడంతో పాటు అవసరమైన బోర్‌వెల్లను హైరింగ్ చేసుకోవడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న 15--20 రోజులు పంటల రక్షణకు అత్యంత కీలకమైనందున వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక విద్యుత్ భారం పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి, స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వీబీజీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులు, నీటి నిల్వ కుంటల నిర్మాణం వంటి పనులను గుర్తించి చేపట్టాలని, అవసరమైన పనుల జాబితాను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చౌటకూర్ గ్రామంలో కౌలు రైతు గొల్ల మహేష్ ఏడు ఎకరాల్లో సాగు చేస్తున్న పత్తి పంటను సీఎస్ పరిశీలించారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని రైతు వివరించారు. వర్షపాతం లోటు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల స్వల్పకాలిక కూరగాయ పంటలను సాగు చేయాలని సీఎస్ సూచించారు. ట్రాన్స్‌కో సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గి విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ఆకుకూరలు, కూరగాయలను పండించడంతో పాటు కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందేలా సంబంధిత శాఖల అధికారులు తగిన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మధులత శ్రీనివాస్‌కు ఘన సన్మానం

తాండూర్, అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :




భారత మాజీ రాష్ట్రపతి, 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. శ్రీ రామకృష్ణ సేవాసమితి, బాలల మాసపత్రిక 'మొలక', శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి శ్రీ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు బాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు గాజుల బసవరాజ్, కవయిత్రి మొల్ల కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ కేవీఎం వెంకట్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ మధులతా శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం భారతదేశానికి విశేష సేవలందించిన మహనీయుడని కొనియాడారు. సాధారణ కుటుంబంలో జన్మించి, పేపర్ బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించి, తన కృషి, పట్టుదలతో శాస్త్రవేత్తగా, దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన ప్రజల రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తుచేశారు. కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి' అనే సందేశంతో కోట్లాది మంది విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. విద్యార్థులు కలలు కనడమే కాకుండా, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. అబ్దుల్ కలాం జీవితం ప్రతి విద్యార్థికి ఆదర్శమని తెలిపారు.మధులతా శ్రీనివాస్‌కు ఘన సన్మానం అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ మధులతా శ్రీనివాస్‌ను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా వక్తలు ఆకాంక్షించారు.ప్రతిభావంతులైన విద్యార్థులకు పుస్తకాల పంపిణీ ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి గౌరవ అధ్యక్షుడు బసవరాజ్, అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రోగ్రాం కన్వీనర్ కేవీఎం వెంకట్, శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, కూటం చంద్రశేఖర్, కవి యూసుఫ్, వెంకట్ వంశరాజు, ప్రభు శంకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు వైశాలి, కార్తీక్, సాయి తేజ, కార్తికేయ, రేవన సిద్ధేశ్వర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

సొంత నిధులతో మహిళలకు బతుకమ్మ కానుకలు..!

పేద, మధ్యతరగతి మహిళలకు చీరల పంపిణీ

సర్పంచ్ రాజుపై ప్రశంసలు





ఝరాసంగం, అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :

సొంత నిధులతో గ్రామ మహిళలకు బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేసిన బర్దిపూర్ సర్పంచ్ రాజు ఆదర్శంగా నిలిచారు. దసరా పండుగ వేళ గ్రామంలోని పేద, మధ్యతరగతి మహిళలను తన అక్కాచెల్లెళ్లుగా భావించి, తన సొంత ఖర్చులతో చీరలు అందజేసి మహిళల పట్ల తనకున్న గౌరవం, ఆప్యాయతను చాటుకున్నారు. గురువారం బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలకు సర్పంచ్ రాజు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ మాట్లాడుతూ ప్రతి మహిళను తల్లిగా భావించి గౌరవించాలని సూచించారు. మహిళల పట్ల గౌరవభావం, సంస్కారాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ రాజు తన సొంత నిధులతో మహిళలకు పండుగ కానుకలు అందించడం అభినందనీయమని సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ కొనియాడారు. ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై, వారి సంతోషాల్లో భాగస్వాములు కావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. పండుగ వేళ మహిళలకు చీరలు అందించి వారి ఆనందంలో భాగస్వామిగా నిలిచిన సర్పంచ్ రాజు కార్యక్రమం గ్రామంలో ప్రత్యేకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తుకారాం, వార్డు సభ్యులు చింతచెట్టు రాజేందర్, అలిగి ప్రేమ్ కుమార్, పిరమ్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలను పట్టించుకొని కాంగ్రెస్

న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం ఆగదు

విద్యుత్ కార్యాలయం ముట్టడి

బీజేపీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి వీరితో

సంగారెడ్డి, అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్

తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సంగారెడ్డిలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, తెలంగాణలో పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని నినదించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బసవ లక్ష్మీనారాయణ, జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారితో పాటు అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ రైతుల ఆందోళనలో పాల్గొన్నారు. రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బసవ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వాల బాధ్యత అని, రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని బసవ లక్ష్మీనారాయణ అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, వ్యవసాయానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేసి రైతులకు పంట నష్టాల నుంచి భరోసా కల్పించాలని కోరారు. రైతుల హక్కుల కోసం బీజేపీ కిసాన్ మోర్చా నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం గురించి మాట్లాడే కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. బీరంగూడ డివిజన్ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతు పొలంలో చెమట చిందిస్తేనే ప్రజల ఇళ్లలో అన్నం ఉంటుంది. అలాంటి రైతన్నను విద్యుత్ సమస్యలతో ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ ప్రశ్నించారు. రైతులు పంటలు పండించేం దుకు రాత్రింబవళ్లు కష్టపడుతుంటే, వారికి అవసరమైన విద్యుత్ సదుపాయాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలుకూరి రాజశేఖర్ రెడ్డి, మాణిక్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ముత్తిరెడ్డి, జిల్లా నాయకులు కోణం విట్టల్, కొండ లక్ష్మణ్ గుప్తా, మహిళా మోర్చా అధ్యక్షురాలు మీనా గౌడ్, వివిధ మండలాలు, డివిజన్ల అధ్యక్షులు, వివిధ సెల్ అధ్యక్షులు, బీజేపీ నాయకులు కృష్ణ, బాలరాజ్, యాదగిరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా





ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు

సంగారెడ్డి, అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ వీరయోధుడు, ప్రజల పక్షాన నిలిచిన పోరాట యోధుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను జిల్లాలో అధికారికంగా, అత్యంత ఘనంగా నిర్వహించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో బిసి వెల్ఫేర్ అధికారి జగదీష్ కు వినతిపత్రం పులిమామిడి రాజు ఆధ్వర్యంలో సమర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 22న నిర్వహించనున్న పండుగ సాయన్న జయంతి ఉత్సవాలను జిల్లా యంత్రాంగం పూర్తి ప్రోటోకాల్‌తో నిర్వహించాలని పులిమామిడి రాజు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో 'రాబిన్‌హుడ్'గా పేరుగాంచిన పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని, త్యాగాలను భావితరాలకు తెలియజేసేలా జయంతి వేడుకలను నిర్వహించాలని సూచించారు.పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 1217 జారీ చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కూడా వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. అదేవిధంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు నీలం మధుకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు పులిమామిడి రాజు తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించి, తగిన గుర్తింపు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా నాయకులు, తెర్పోల్ సర్పంచ్ సతీష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు జనార్దన్, ఈశ్వర్, బొట్టు వెంకన్న, గుణాకర్, శ్రీనివాస్, తిర్మల్, రామ క్రిష్ణ, సాయి కిరణ్, ఆనంద్, గవ్వల కేశవ్, సుధాకర్, రాజేష్, బస్వరాజ్, మండల నాయకులు యువ నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్టాపన

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

తాండూర్, అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :

పెద్దముల్ మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన ధ్వజస్తమ్మ ప్రతిష్టాపన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయ స్వామి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా ఐక్యమత్యంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను కూడా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామ పెద్దలు యువకులు , పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





నూతన వ్యాపార సముదాయం ప్రారంభం

ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూర్ అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :

ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధితోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీ సద్గురు పోట్లీ మహారాజ్ దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన వ్యాపార సముదాయాల కాంప్లెక్స్ లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దేవాలయ ఖాతాల్లో కేవలం నాలుగు లక్షలు మాత్రమే ఉండగా ప్రస్తుతం మొత్తం రూ. 40 లక్షలకు చేరిందని తెలిపారు ఆలయ ఆదాయాన్ని మరింత పెంచి వచ్చే నిధులను దేవాలయ అభివృద్ధి భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఆలయంలో శివాలయం, దాసోహం, రాజగోపురం నిర్మాణ పనులు చేపడుతున్న వారిని ఎమ్మెల్యే అభినందించారు. శ్రీ సద్గురు పోట్లీ మహారాజ్ దేవాలయాన్ని ఆధ్యాత్మికంగా ఆర్థికంగా మరింత అభివృద్ధి చేసేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రసాద్ గౌడ్, ఈవో నరేందర్, పలువురు ప్రజా ప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు, నాయకులు పాల్గొన్నారు.





పిఠాపురంలో 108వ సిద్ధమంగళ స్తోత్ర పారాయణం

తాండూర్, అక్టోబర్ 15, వార్త దీపిక న్యూస్ :

శ్రీపాద శ్రీనివాస స్వామి దత్తపీఠ చైతన్యపురి సలహా మేరకు 2024 భాద్రపద మాసం చిత్తనక్షత్రం వినాయక చవితి 84గ్రూప్ కోఆర్డినేటర్ గా పారాయణాలు దత్తస్వామి అజ్ఞాతో ప్రారంబించారు. 2025 జనవరి 26తేదీ వరకు 50పారాయణాలు చేశారు. 2026అక్టోబర్ 11చిత్త నక్షత్రం రోజున 108పారాయణం చేయడం తాండూర్ వాసుల అదృష్టమని వివరించారు. ఈ నెల 11న శ్రీపాద శ్రీవల్లభ స్వామి సన్నిధిలో ప్రత్యేక కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ స్వామి ఆధ్వర్యంలో 108వ సిద్ధమంగళ స్తోత్ర పారాయణ కార్యక్రమాన్ని పిఠాపురంలో మూడు రోజులపాటు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కందనెల్లి గౌరీ సంగమేశ్వర్ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారి ఆశీస్సులు, భక్తి, ఆధ్యాత్మికతను పెంపొందించే లక్ష్యంతో ఈ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు దత్త టీం కందనెల్లి గౌరీ సంగమేశ్వర్‌తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులుఎస్. జగదీశ్వర్‌ఎస్. శోభారాణి, ఎస్. సహస్ర, బి. లలిత, రొంపల్లి శమంతకమణిరాజేశ్వరి, కె. శ్రీధర్, కె. లక్ష్మి సులోచనపాల్గొన్నారు.

Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984